తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం
గురువారం 05 మార్చి 2026
I



# రహదారి భద్రతపై విస్తృత అవగాహన

## జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో మార్చి 4 ప్రభాత వార్త** రాజమహేంద్రవరం లోని పలు ప్రాంతాలలో రవాణా కార్మికులకు గురువారం మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రత , బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పరిధిలోని శ్రీ గణపతి ఆటో ఓ అంబులెన్స్ యజమానులు, కార్మికుల సంఘం, అనం కళా కేంద్రం సమీపంలోని శ్రీ శివ గణేష్ కార్ టాక్సీ స్టాండ్, రైల్వే స్టేషన్ ఆటో ఓ టాక్సీ స్టాండ్ యూనియన్, ౯జ కాంప్లెక్స్ ఆటో వర్కర్స్ యూనియన్‌లలో జరిగింది. రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లు ప్రజల ప్రాణాలకు బాధ్యత వహించే స్థితిలో ఉంటారని, కాబట్టి మాదకద్రవ్యాల దుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ప్రమాదం కలిగిస్తుందని జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ తెలిపారు.మాదకద్రవ్యాలు, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలు కుటుంబాలకు, సమాజానికి, దేశానికి అపార నష్టాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే విధించే శిక్షలు, జరిమానాలు లైసెన్స్ రద్దు వంటి చట్టపరమైన చర్యల గురించి వివరించారు.

### 7న జాతీయ అనుసూచిత జాతుల

# కమిషన్ చైర్మన్ కిషోర్ జిల్లా పర్యటన

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో మార్చి 4 ప్రభాత వార్త** జాతీయ షెడ్యూల్ జాతుల కమిషన్ చైర్మన్, కేంద్ర కేబినెట్ మంత్రి హోదా కలిగిన కిషోర్ మక్వానా ఈనెల 7, 8 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు రానున్నారనీ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.పర్యటన సందర్భంగా 7న జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో సెక్రటరీ గుడే శ్రీనివాస్, డైరెక్టర్; డాక్టర్ జి. సునీల్ కుమార్ బాబు, చైర్మన్ సహాయ సిబ్బంది పి ఎస్ నితీష్ కుమార్, సీహెచ్. నవీన్ కుమార్, వంటి అధికారులు పాల్గొంటారు. జిల్లాలో షెడ్యూల్ కులాల సంక్షేమం, అమలులో ఉన్న పథకాలు, సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

# సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యపు విధులు..

# కలెక్టర్ కు పిర్యాదు



**రాజవొమ్మంగి, మార్చి 04, ప్రభాతవార్త** పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం దూసారపాము సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్స్ ఏఒక్క రిజిస్టర్ సక్రమంగా నిర్వహించడం లేదని ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు అన్నారు. బుధవారం రెండు సచివాలయాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. పంచాయితీ కార్యదర్శి, డి. ఏ లు విధులకు వచ్చి వెళుతున్నారని పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. రికార్డులు అప్డేట్ గా లేవన్నారు. విధులపై చాలా నిర్లక్ష్యంగా ఉన్నారని ఇన్ చార్జి జిల్లా కలెక్టర్ కు తెలియజేస్తున్నట్లు ఎంపిడిఓ వెల్లడించారు.


# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

### అధికారులకు చింతూరు ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి అదేశం.



**చింతూరు ,మార్చి4?,ప్రభాతవార్త:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్ )ద్వారా వచ్చే దరఖాస్తులను అధికారులు అత్యంత ప్రాధాన్యతతో స్వీకరించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని మండల తాశీల్దార్, డిప్యూటీ తాశీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్స్, విఆర్వోస్, యం పి డి ఓ, ఏ పి యం తదితర అధికారులకు చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం చింతూరు ఐటీడీఏ లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భూ సమస్యలపై 08 దరఖాస్తులు ఆరండర్ సమస్యలపై 09 దరఖాస్తులు ఇతర సమస్యలపై 27 దరఖాస్తులు వచ్చాయి. సంబంధిత అధికారులు తక్షణ వాటిని పరిశీలించి అర్జీదారులతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేయవలసిందిగా ఆయన ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఏపిఓఐటీడీఏ చింతూరు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ బొత్సను కలిసిన రాజేశ్వరీదేవి



**మామిడికుదురు.ఫిబ్రవరి 04(ప్రభాతవార్త)** వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు,ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత,ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను రాజోలు నియోజకవర్గం కో-ఆర్డినేటర్,మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి ఆమె కుమారుడు రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాముల దేవీ ప్రకాష్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్చం అందించారు.ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం హైదరాబాద్ లో విశ్రాంతి తీసుకుంటున్న బొత్సను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.టీటీడీ మాజీ చైర్మన్ రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి ని కూడా రాజేశ్వరీదేవి కలిశారు.వారి వెంట పార్టీ నాయకులు సూరిశెట్టి బాబి ఉన్నారు.

# ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్ సుష్మకు డాక్టరేట్



**గండేపల్లి మార్చి 4 (ప్రభాతవార్త):** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న సుంకర సుష్మ సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ భువనేశ్వర్ నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ భువనేశ్వర్ కి చెందిన కంప్యూటర్ సైన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా.సస్మిత కుమార్ నాయక్ నేతృత్వంలో డా. ఎం. వంశీ కృష్ణ సహకారంతో సుంకర సుష్మ సమర్పించిన థీసిస్ శీర్షిక:"ఏ మల్టి స్టేజ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ టాక్సిక్ కామెంట్ డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ విత్ హైబ్రిడ్ ఎంబెడ్డింగ్ టెక్నిక్స్ అండ్ అడ్వాన్స్ ఏ.ఐ.పారాడింగ్మ్స్ " అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు.సుష్మ భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్.డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, విభాగాధిపతి. డా.ఎం.రాజబాబు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది సుష్మ కి అభినందనలు తెలిపారు.



### ఒడిశాలో వీల్‌చైర్ క్రికెట్‌లో..

# ఆంధ్రప్రదేశ్‌కు ద్వితీయ స్థానం

### తూర్పుగోదావరి క్రీడాకారుల ప్రతిభకు కలెక్టర్ అభినందనలు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో మార్చి 4 ప్రభాత వార్త** దివ్యాంగ క్రికెట్ కంట్రోల్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యం లో, సమీర్ దివ్య సాహిత్య ట్రస్ట్ నిర్వహణలో ఒడిశా రాష్ట్రంలో ఫిబ్రవరి 21 నుండి 23 వరకు జరిగిన వీల్‌చైర్ క్రికెట్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ జట్టులో మొత్తం 8 మంది క్రీడాకారులు తూర్పుగోదావరి జిల్లాకు చెందినవారు కావడం విశేషం. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి క్రీడాకారులను అభినందించారు. దివ్యాంగ క్రీడాకారులు ప్రతిభతో రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చారని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా పరిపాలన తరఫున అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శేషగిరి, యోగా కోచ్ నాగేంద్ర, ఫుట్‌బాల్ కోచ్ నాగరాజు, చెస్ కోచ్ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటి పన్ను వసూళ్లను

# త్వరతిగతిన పూర్తి చేయాలి.: డీఎల్పీఓ బాలమణి



**శంఖవరం, మార్చి 4, ప్రభాతవార్త.** పన్ను వసూళ్లను నూరు శాతం పూర్తి చేసేలా పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్పీవో బాలమణి సూచించారు. శంకవరం మండలం లో అన్నవరం కత్తిపూడి గ్రామాలలో బుధవారం ఆమె హౌస్ టాక్స్ లపై పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్పీవో బాలమణి మాట్లాడుతూ మార్చి నెలాఖరు నాటికి ఇంటి పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పన్ను వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యాలను అధికమించి, నూరు శాతం వసూలు జరిగేలా చూడాలన్నారు.ప్రజలు కూడా సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి సహకరించాలన్నారు.ప్రజలు చెల్లించే పన్నులతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో ప్రతి పంచాయతీని సందర్శించి హౌస్ టాక్స్ లపై దృష్టి సారించడం జరిగిందన్నారు ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు ఆమె వెంట గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శి మధు శేఖర్, స్వామి పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# బాణాసంచా దుకాణాలపై పోలీసులు తనిఖీ....



**కాకినాడ రూరల్, మార్చి 4 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ మండలం లో నిర్వహిస్తున్న బాణాసంచా దుకాణాలపై జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు పోలీసులు తనిఖీ నిర్వహించారు.
బుధవారం స్థానిక వసంత నగర్ ప్రాంతంలో తాతపూడి అశోక్ కు చెందిన ఫైర్ క్రాకర్స్ దుకాణాన్ని అధికారులు తనిఖీ చేసి 2025 డిసెంబర్ తో గడువు ముగిసిన లైసెన్స్ గుర్తించారు. తనిఖీ సమయంలో దుకాణ ప్రాంగణంలో ఎటువంటి తయారీ జరగకపోవడంతో , నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వ్యాపారం నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. యజమాని అశోక్ పై చట్టపరమైన చర్యలు చేపడతామని సీఐ బి.పెద్దిరాజు తెలిపారు. తనిఖీ లో ఎస్డిపిఓ, ఏ ఎస్ పి దేవరాజ్ పటేల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏపి రాష్ట్ర ఆదాయానికి గండి కొడుతున్న

# డీజీల్ పెట్రోల్ రిటైల్ అమ్మకాలు.

### వ్యాపారుల చూపంతా పక్క రాష్ట్రాల వైపు.



**పోలవరం జిల్లా ప్రతినిధి మార్చి 4 ప్రభాతవార్త.** ఏపీ సరిహద్దు ప్రాంతాలను ఆనుకొని ఉన్న తెలంగాణ,ఛత్తీస్గడ్ ఒరిస్సా, యానం వంటి ప్రాంతాల్లో డీజిల్, పెట్రోల్ ధరలు తక్కువగా ఉండటంతో చాలామంది సరిహద్దు ప్రాంతాల్లో రిటైల్ వ్యాపారులు పక్క రాష్ట్రాల నుండి డీజిల్, పెట్రోలను మన రాష్ట్రానికి తరలించి ఇక్కడ అమ్ముకుంటున్నారు. తద్వారా పెట్రోల్ బంకుల ద్వారా రాష్ట్రానికి చేకూరే ఆదాయానికి భారీ గండి పడుతుంది.ఏ పి లో పెట్రోల్ ధర రూ. 110.27 పైసలు,తెలంగాణ లో 108.82పైసలు,ఛత్తిస్ ఘడ్ లో 101.65 పైసలు, ఒడిస్సా లో 101.19 పైసలు, అదే డీజీల్ అయితే ఏ పి లో 98.16 పైసలు, తెలంగాణ లో 97.09 పైసలు, ఛత్తిస్ ఘడ్ లో 95.41పైసలు, ఒరిస్సా లో 93.64 పైసలు ఉంది. ఆయా రాష్ట్రాలలో ట్యాక్స్ ను బట్టి ధరలు మారుతూ ఉంటాయి. అనేక చోట్ల బంకులు అనేవి అందుబాటులో ఉండవు. కాబట్టి షాపుల వద్ద రిటైల్ వ్యాపారం తప్పదు. బంకులు ఉన్న ప్రధాన రహదారుల పైన మాత్రమే ఉంటాయి. మారుమూల గ్రామాలు, పల్లెలో రిటైల్ వ్యాపారులు లేకుంటే అక్కడి ప్రజలకు చాలా కష్టం. గ్రామాల్లో ట్రాక్టర్లులు, ఆటో లు, ఆయిల్ ఇంజన్లు, పడవలు, లాంచీలు, పవర్ స్ప్రేయర్స్, చిన్న చిన్న మిల్లులు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉంటాయి. నిత్యం పెట్రోల్, డీజీల్ లేకుండా చాలా కష్టం. సో ప్రజల అవసరం అనుకోండి, వ్యాపార లాభం అనుకోండి గ్రామాల్లో పెట్రోల్, డీజీల్ అమ్మకాలు కామన్. కానీ ప్రతి రోజు తెలంగాణ ప్రాంతం నుండి ఏ పి లో కి సుమారు రూ 7 నుంచి 8 లక్షల విలువైన పెట్రోల్, డీజీల్ వస్తుంది, అదే వ్యవసాయ సీజన్లో అయితే రోజుకు సుమారు రూ 70 నుంచి 80 లక్షల విలువైన పెట్రోల్, డీజీల్ ఏ పి లో కి వస్తుంది. ఇది కేవలం భద్రాచలం ప్రాంతం నుంచే, ఇలా ఒక్కో ప్రాంతంలో ఒక్కో పరిస్థితి ఉంటుంది. సో ప్రజల అవసరాలు, వెసులుబాటు చూసుకొని తమకు కాస్త లాభం వచ్చేలా వ్యాపారాలు ఇతర రాష్ట్రాల నుండి కొనుగోలు చేస్తారు. ఇలా పక్క రాష్ట్రాలలో నుండి డీజీల్, పెట్రోల్ మన రాష్ట్రంలో కి తెచ్చి అమ్మటం చట్ట రిత్యా నేరం. దాని వల్ల మన రాష్ట్రానికి వచ్చే ఆదాయానికి గండి పడుతుంది. మనం ఒక లీటర్ పెట్రోల్ బంక్ లో మన బండి లో పోసుకుంటే ఆ లీటర్ పెట్రోల్ ధర రూ. 110.27 పైసలు ఉంటే అందులో ఏ పి ప్రభుత్వం టాక్స్ 31 % అంటే సుమారు రూ 23 రూపాయలు, అవి గాక రూ 4 అదనపు టాక్స్, 1రూపాయి రోడ్ టాక్స్ ఇలా ఒక్క లీటర్ పెట్రోల్ నుండి 29 రూపాయలు ప్ర భుత్వానికి ఆదాయం వస్తుంది.ఇలా పెట్రోల్, డీజీల్ ధ్వారా ప్రతి నిత్యం రాష్ట్రానికి వందల కోట్ల లాభం వస్తుంది. కానీ సరిహద్దు ప్రాంతాల్లో ఉండే వ్యాపారులు తెలిసో తెలియకో పక్కన రాష్ట్రాల్లో ధర తక్కువ ఉంది, అక్కడ తెచ్చుకుంటే మనకో రూపాయి అదనంగా మిగులుతుంది అని అలోచిస్తున్నారు తప్ప దీనివల్ల రాష్ట్ర ఆదాయనికి గండి పడుతుంది అని ఎవరు ఆలోచించటం లేదు. పక్క రాష్టాలు, యానాం వంటి కేంద్ర పాలిత ప్రాంతం నుండి అక్రమంగా పెట్రోల్, డీజీల్ రాకుండా అధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది.రిటైల్ వ్యాపారులు సైతం పక్క రాష్ట్రాల నుండి పెట్రోల్, డీజీల్ కొనుగోలు చేయకుండా అధికారులు, చర్యలు తీసుకొని, మన రాష్ట్ర ఆదాయనికి గండి పడకుండా చూడాల్సిన అవసరం ఉంది.

# అక్రమ పిడీఎస్ రైస్ తరలిస్తున్న వాహనం పట్టివేత



**రావులపాలెం, మార్చి 04 (ప్రభాతవార్త) :** జాతీయరహదారి రావులపాడు సమీపంలో అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు గుర్తించారు. రావులపాలెం ఎస్సై జి చంటి తెలిపిన వివరాల ప్రకారం ౕూ 39 ౨జీ 8358 నంబర్ గల బడా దోస్తు వాహనంలో అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో రావులపాడు వద్ద తనిఖీలు చేపట్టగా సుమారు బడా దోస్త్ వాహనంలో రెండు వేల కిలోల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించినట్లు తెలిపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ రేషన్ బియ్యం తరలింపుకు పాల్పడుతున్న వీరేంద్ర సిద్ధు పై కేసు నమోదు చేసినట్లు జి చంటి ఎస్సై తెలిపారు. ఈ సంఘటన పై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

### వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు

# చర్యలు తీసుకోండి..

### అధికారులకు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశాలు



**అమలాపురం కలెక్టరేట్, మార్చి 4 (ప్రభాతవార్త)** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రానున్న వేసవిలో త్రాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఆర్డబ్ల్యూఎస్ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించడంతో పాటు, పరిశు భ్రత వాతావరణాన్ని నెలకొల్పడం ప్రభుత్వ ప్రాధాన్యత అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ త్రాగునీటి సరఫరా మరియు పారిశుద్ధ్య విభాగం జలజీవన్ మిషన్ ఆపరేషన్, వాటర్ గ్రిడ్ నిర్వహణ మరియు సిపిడబ్ల్యు స్కీముల నిర్వహణ, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం సంక్షేమ వసతి గృహాలు అంగన్వాడీ లలో మరుగుదొడ్ల నిర్మాణానికై చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా క్లోరినేషన్ మరియు శుభ్రపరిచిన నాణ్యమైన త్రాగునీరు సరఫరా చేస్తూ పైపు లీకేజీలు ఏర్పడకుండా డయేరియా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను బలోపేతం చేయాలన్నారు. వసతి గృహ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో ప్లాంట్లు, మరుగుదొడ్లు స్థితిగతులపై ప్రతినెల పర్యవేక్షణ తనిఖీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ పర్యవేక్షణ ఇంజనీర్ ఏవీఎస్ రాజన్ జిల్లాలో చేపట్టిన త్రాగునీటి వసతుల కల్పన, పారిశుద్ధ్య పరంగా కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణాల పురోగతిని పనుల నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ కు వివరించారు. గ్రామాలలో పైప్ లైన్ లీకేజీ వల్ల డయేరియా కేసులు ప్రబలితే అందుకు ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ స్పష్టంచేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు పద్మనాభం, రాంప్రసాద్, రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

# కత్తిపూడిలో ఘనంగా వరుపుల రాజా వర్ధంతి వేడుకలు



**శంఖవరం ,మార్చి 4, (ప్రభాతవార్త)** శంకవరం మండలంలోని కత్తిపూడి లో దివంగత నేత వరుపుల రాజా తృతీయ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కత్తిపూడి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో రాజా చిత్రపటం వద్ద టిడిపి నేతలు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో రాజా చిరస్మరణీయుడని, మంచి స్నేహితుడు లాంటి గొప్ప వ్యక్తిని కోల్పోవడం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని తెలిపారు. రాజా ఆశయాలు స్థానిక శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ ద్వారా నెరవేర్చడం జరుగుతుందన్నారు . నిత్యం ప్రజలలో ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలు పై పోరాడుతూ ప్రజల పక్షాన చివరి శ్వాసవరకు రాజా పనిచేశారని, అలాంటి మహోన్నత వ్యక్తిని ఎవరు మరువలేరని తెలిపారు. పేదవారి ఆకలి తీర్చాలని నిరంతరం తపించే వ్యక్తి రాజా అని ఆయన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం బారి అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. శంఖవరంలో టిడిపి నేత పర్వత సురేష్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గాబు కృష్ణ, కేలంగి జనార్ధన్ మచ్చ గంగరాజు, యాగా వీరబాబు రౌతు శివ, సాధనల లక్ష్మీ బాబు, నక్క శీను, పొలం చిన్న, కంద గోవిందు , గాబు శివ, నాయుడు బాబురావు ,కర్రీ రాంబాబు, కొయ్యరవణ, దేశలంక వెంకటరమణ, గాబు ఈశ్వరరావు, నాయుడు ఈశ్వరరావు, కర్రి బుజ్జి ,తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధే ధ్యేయంగా కూటమి పరిపాలన.



**కడియం ,మార్చి 4 (తర్వాత వార్త)** కడియం : గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ పేర్కొన్నారు. వీరవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల సేకరణలో భాగంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సూచనల మేరకు బుధవారం వీరవరం గ్రామ సర్పంచ్ బత్తుల జయంతి భర్త రాము, జనసేన నాయకులు ఆదిమూలం సాయిబాబా, తాసిల్దార్ సునీల్ కుమార్, ఏఈ రామారెడ్డి లతో కలిసి ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ పలు ప్రాంతాలను పరిశీలించారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎంత స్థలం కావాల్సి ఉంటుందీ, పరిశీలించిన స్థలం సరిపోతుందా? అనే విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుంది అన్నారు. కడియంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయిందని త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. అలానే వీరవరంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రణాళికలు జరుగుతున్నాయని ప్రసాద్ తెలిపారు. స్థల సేకరణ పూర్తి అయిన వెంటనే ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేతుల మీదుగా శంకుస్థాపన పనులు మొదలవుతాయని ప్రసాద్ తెలిపారు.

# పెద్దాపురం ఇన్ఛార్జ్ ఆర్డీఓగా శ్రీధర్



**పెద్దాపురం(గండేపల్లి) మార్చి 4(ప్రభాతవార్త):** పెద్దాపురం ఇంచార్జ్ రెవిన్యూ డివిజనల్ అధికారిగా ఎన్.శ్రీధర్ ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎస్ఎస్ మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఆర్డీవో గా పని చేస్తున్న శ్రీరమణిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సస్పెండ్ చేసిన విషయం విధితమే.బుధవారం ఎన్. శ్రీధర్ ను జిల్లా కలెక్టర్ షగిలి షాన్మోహన్ ఆర్డిఓ గా నియమించారు. బుధవారం సాయంత్రం శ్రీధర్ పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డిఓ గా బాధ్యతలు చేపట్టారు. సామర్లకోట మండలం వేట్లపాలెం బాణాసంచా పరిశ్రమ ప్రమాదంలో 26 మంది మృతి చెందారు. అధికారుల తనిఖీల వైఫల్య ఫలితంగా ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా లభించిన నివేదిక ప్రకారం ఆర్డిఓ శ్రీరమణిని సస్పెండ్ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు.ఈ సందర్భంగా ఇంచార్జ్ ఆర్డీవో గా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ ను పెద్దాపురం తాహాసిల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

